ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 30
సంచిక : 160
పేజీలు : 3

మంగళవారం, మార్చి 03, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## సహజసిద్ధమైన రంగులతో హోలీ

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**టీ మీడియా,మార్చి2, భద్రాద్రి కొత్తగూడెం:**హోలీ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుభాకాంక్షలు తెలిపుతూ హోలీ పండుగను సాంప్రదాయబద్ధంగా, పరస్పర గౌరవంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ప్రజలను కోరారు. హోలీ వేడుకల సందర్భంగా సహజసిద్ధమైన రంగులను మాత్రమే ఉపయోగించాలని, హానికరమైన రసాయనిక రంగులను వాడకూడదని సూచించారు.ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా బలవంతంగా రంగులు చల్లడం,నీటి బెలూన్లు విసరడం వంటి చర్యలు చేయరాదని



హెచ్చరించారు.ప్రార్ధనా మందిరాలు,ప్రజా ప్రదేశాలు,రహదారులపై వాహనదారులకు ఆటంకం కలిగించే విధంగా ప్రవర్తించవద్దని తెలిపారు.ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇందుకోసం షీ టీమ్ బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ప్రధాన కూడళ్లలో మరియు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘా బృందాలను ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు.పండుగ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని,జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత వాహనాలను అతివేగంగా నడపకుండా జాగ్రత్తగా ఉండాలని, రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఈత రాని వారు చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లకూడదని,చిన్నపిల్లలను అటువంటి ప్రదేశాలకు తీసుకెళ్లరాదని విజ్ఞప్తి చేశారు. లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.జిల్లా ప్రజలందరూ పరస్పర గౌరవంతో,సురక్షితంగా హోలీ పండుగను జరుపుకొని పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.



## సింగరేణి క్వార్టర్లలో తప్పిన పెను ప్రమాదం

### -పూజ గదిలో మంటలు

**టీ మీడియా,మార్చి2, రుద్రంపూర్ :** పూజ గదిలో దేవుడి కోసం వెలిగించిన దీపం ఇంటిని దహనం చేసింది. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధి రుద్రంపూర్ పంచాయతీ పరిధిలోని గోపి ఏరియాలో సోమవారం చోటుచేసుకున్న అగ్నిప్రమాదం స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. అయితే రంజాన్ మాసం ఉపవాసంలో ఉన్న యువకుల సాహసంతో పెను ప్రమాదం తప్పింది. గోపి ఏరియాలోని క్వార్టర్ నం.ఐ-285లో నివసిస్తున్న గుత్తుల దుర్గాప్రసాద్ కుటుంబం పూజ గదిలో దీపాలు వెలిగించి బయటకు వెళ్లింది. కొద్ది సేపటికే పూజ గదిలో మంటలు చెలరేగి ఇంటి ఇతర గదులకు వ్యాపించాయి. ఒక్కసారిగా ప్రాంతమంతా దట్టమైన పొగతో కమ్ముకోవడంతో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురయ్యారు. మంటలు వంటగదిలోని

మిగతా 2లో

## ప్రశాంతంగా పరీక్షలకు హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి






**టీ మీడియా,మార్చి2, ఖమ్మం:**ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా 10వ తరగతి పరీక్షలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.పదవ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం స్థానిక శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన మోటివేషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి జీవితంలో పదవ తరగతికి చాలా ప్రాముఖ్యత ఉందని, విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరు కావాలని, మనం భయపడితే చదివింది కూడా మర్చిపోతామని, పరీక్షలకు మరో 2 వారాల గడువు ఉందని, ఉన్న సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భయపడితే మనకు ఉన్న సమయాన్ని సరిగ్గా వాడుకోలేమన్నారు. మనం నమ్మకంగా ఉంటూ పరీక్షలకు హాజరైతే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. నెల రోజుల పాటు పదవ తరగతి పరీక్షలు ఉంటాయని, విద్యార్థులు ఫోకస్ తో ప్రిపేర్ ఐతే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు.విద్యార్థులు వీలైనంత వరకు గత సంవత్సరాలలో వచ్చిన ప్రశ్న పత్రాలకు సొంతంగా పరీక్ష రాసి పరీక్షించుకోవాలని అన్నారు. విద్యార్థులు ఎన్ని ప్రాక్టీస్ టెస్ట్ లు రాస్తే అంత మెరుగ్గా ఫైనల్ ఎగ్జామ్ లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారని అన్నారు. ఒలంపిక్ క్రీడాకారులు ఎలాగైతే ప్రతి రోజూ ప్రాక్టీస్ చేస్తారో, అదే విధంగా మనం పాఠ్యాంశాల పునశ్చరణతో పాటు ప్రాక్టీస్ పరీక్షలు అధికంగా రాయాలన్నారు.విద్యార్థులు తాము ఏ సబ్జెక్టులో వీక్ ఉన్నామో తెలుసుకొని అధిగమించేందుకు కొంత అధిక సమయం కేటాయించాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులు నిద్రలేకుండా ఎట్టి పరిస్థితుల్లో ఉండవద్దని, ప్రతి రోజు కనీసం 6 నుంచి 7 గంటల పాటు మంచి నిద్ర ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో బయట ఆహారం తీసుకోవద్దని, బయట ఎక్కువ తిరగవద్దని, మంచినీరు తగినంత త్రాగాలని కలెక్టర్ సూచించారు.అనంతరం మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థిని, విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి చైతన్య జైని, మోటివేషన్ స్పీకర్ గంపా నాగేశ్వర రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పదవికి వన్నె తెచ్చిన శ్రీపాదరావు

### -జిల్లా కలెక్టర్ అంకిత్

**టీ మీడియా,మార్చి2, భద్రాద్రి కొత్తగూడెం:** శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు.దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా సోమవారం ఐడీఓసి కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ, శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని అభివర్ణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్గా పనిచేసిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో విశిష్ట పాత్ర పోషించారని తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకరమైన విషయమని అన్నారు.దుద్దిళ్ల శ్రీపాదరావు 2 మార్చి 1935న జయశంకర్ భూపాలపల్లి జిల్లా ధన్వాడ గ్రామంలో జన్మించారు. స్వగ్రామంలో ప్రాథమిక విద్యను పూర్తిచేసి, మంథనిలో ఉన్నత విద్యను అభ్యసించారు. అనంతరం హైదరాబాద్లో ఇంటర్మీడియట్, బి.ఎస్సి., ఆర్ట్స్ మరియు లా విద్యలను అభ్యసించారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారు.తెలంగాణ ప్రాంతానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడైన ఆయన ధన్వాడ గ్రామ సర్పంచ్గా పలు మార్లు సేవలందించారు. 1980లలో మరియు 1990ల ప్రారంభంలో మంథని నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని పొందారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్గా బాధ్యతలు స్వీకరించి విశిష్ట సేవలందించారు.స్పీకర్గా ఆయన నిష్పాక్షికత, క్రమశిక్షణ, ప్రజాస్వామ్య విలువల పట్ల అంకితభావంతో సభా కార్యక్రమాలను





## భూదాన్ నిర్వాసితులకు న్యాయం చేయాలి

### బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ

**టీ మీడియా, మార్చి 2, ఖమ్మం:**ఇటీవల నగరంలోని వెలుగుమట్ల ప్రాంతంలో గల భూదాన్ భూలలో ఇళ్లు కోల్పోయిన నిరు పేదలం దరికీ వెంటనే న్యాయం చేయాలనీ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ కోరారు.ఈ మేరకు పార్టీ ప్రతినిధి బృందం సోమవారం ఇళ్లు కూల్చివేసిన ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించింది.అనంతరం నిర్వాసితులకు అన్నదానం నిర్వహించింది.ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం భూదాన్ భూముల్లో దమన కాండ ను ప్రదర్శించి పేదల ఇళ్లను కూల్చివేసిందన్నారు.ఈ ఘటనలో 30 ఎకరళాలలోని వారి ఇళ్లను కూల్చివేసి వారికి నిలువనీద లేకుండా చేసిందన్నారు.వెంటనే ప్రభుత్వం వారిగి ఇళ్లను అదే శతాపంలో నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.అప్పటివరకు బిఆర్ఎస్ పార్టీ వారికి అండగా ఉంటుందని స్పష్ట.చేశారు.ఈ కార్యక్రమంలో కురాకుల నాగభూషణం,మాజీ సూడా ఛైర్మన్ బచ్చు విజయ్, మాజీ బత్తుల మురళీపార్టీ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు,పార్టీ నగర యువజన విభాగం నప్రదాన కార్యదర్శి మాటే టి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ నామ హోలీ శుభాకాంక్షలు



**టీ మీడియా, మార్చి 2, ఖమ్మం :**రంగుల పండుగ హోలీ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని తెలిపారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని రసాయనాలతో తయారైన హానికర రంగులను ఉపయోగించకుండా సహజసిద్ధమైన రంగులతో హోలీ జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. సమాజంలో ఐక్యత, స్నేహభావం, పరస్పర గౌరవాన్ని పెంపొందించే ఉత్సవంగా హోలీ నిలవాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకు ప్రతి ఇంటిలో ఆనందం వెల్లివిరియాలని కోరుకున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేస్తూ, వాటి విలువలను భావి తరాలకు అందించేలా పిల్లల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. హోలీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాలు, సంబరాలు నింపాలని నామ కోరుకున్నారు.

## శిలాఫలకాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు

### పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**టీ మీడియా ,మార్చి 2,తిరుమలాయపాలెం:** తిరుమలాయపాలెం మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో ఆదివారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహా. శిలాఫలకం ధ్వంసం చేసిన సంఘటన పై వివిధ దళిత సంఘాలు ఖండిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయడం జరిగింది వెంటనే కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేయాలని లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు, అనంతరం. మండల కేంద్రం లోని అంబేద్కర్ విగ్రహం వద్ద. నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో, హస్నాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ బొబ్బిలి భరత్ చంద్ర, ప్రొఫెసర్ మాగి వెంకన్న, హస్నాబాద్ మూడో వార్డు సభ్యుడు. మాగి వెంకన్న డెమొక్రసీ మండల నాయకులు యాతాకులు నాగేశ్వరరావు, బిఆర్ఎస్ పార్టీ హస్నాబాద్ గ్రామ కార్యదర్శి పల్లి వినోద్, పీడీఎస్యు.నాయకులు మాగి రాకేష్. బి.ఎస్.పి మండల నాయకులు పుల్లయ్య, హస్నాబాద్ గ్రామ అంబేద్కర్ కమిటీ. సభ్యులు మాగి వెంకటేష్,మాగి మహేష్,మాగి రస్వాంత్,మాగి నరేష్ పాల్గొన్నారు, ప్రజల మనోభావాలను దెబ్బతీసే ఇటువంటి ఘటనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని దుండగులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు



# స్మార్ట్ కిడ్జ్‌లో హోలీ సంబురాలు



### -రంగులు పూసుకుంటూవిద్యార్థుల ఎంజాయ్

**టీ మీడియా, మార్చి 2, ఖమ్మం** :స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో సోమవారం ముందస్తు హోలీ సంబరాలు ఆనందోత్సవాలతో జరిగాయి. పాఠశాలలోని వివిధ తరగతుల విద్యార్థులు ఒకరికొకరు సాంప్రదాయ రంగులు పూసుకొని రంగుల పండుగ లో ఎంజాయ్ చేశారు. తరతరాలుగా వస్తున్న హోలీ రంగుల వేడుకలలో చిన్నారులు పాఠశాలలో ఈ సంవత్సరం కూడా సంప్రదాయాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి మన భారతీయుల సంస్కృతి సాంప్రదాయాలలో రంగుల కేళి హోలీ పర్వదినానికి ప్రత్యేక స్థానం ఉందని తెలియజేశారు. అలనాడు బృందావనంలో శ్రీకృష్ణుడు గోపికలతో కలిసి రంగుల సంబరాలు నిర్వహించిన సాంప్రదాయాన్ని ప్రతి ఏటా సాంప్రదాయంగా జరుపుకుంటున్నారు అని తెలిపారు. ఈ హోలీ సంబరాల లో రసాయనిక రంగులను వాడడం ఆరోగ్యానికి హానికరమని, అందుకే సాంప్రదాయ మరియు సహజ రంగులను హోలీ వేడుకలలో ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# అంగరంగవైభవంగా శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం



**టీ మీడియా,మార్చి02,సింగరేణి(కారేపల్లి):** సింగరేణి మండల కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి(సంత)గుడి ప్రాంగణంలో సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం భక్తి పారవశ్యంతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే ఆలయంలో స్వామి వారికీ ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారిని అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించిన కల్యాణ వేడుక ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత మధురంగా మార్చింది. పుష్పాలతో సుందరంగా ముస్తాబు చేసిన కల్యాణ మండపం కనుల పండువగా దర్శనమిచ్చింది. మేళ తాళాలు, వాయిద్యాల శుభనాదాల మధ్య స్వామివారి కల్యాణం ఘనంగా సాగింది. అర్చకులు స్వామివారి దివ్య గుణాలను, కల్యాణ మహిమలను వివరించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. కల్యాణాన్ని వీక్షించేందుకు పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కల్యాణానంతరం ఆలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించి వందలాది భక్తులకు భోజన ప్రసాదం వడ్డించారు.



**ఊరేగింపు**

సాయంత్రం వేళ ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో భాజా భజంత్రీలు, డీజే పాటలతో ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఛైర్మన్ కె .వేణు గోపాలచార్యులు , జూనియర్ అసిస్టెంట్ మూడ్ మోహన్, సత్యం, దేవాలయ సిబ్బంది,స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారులు, మహిళలు, యువకులు పాల్గొని సేవలందించారు. మొత్తం కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య విజయవంతంగా ముగిసింది.



### వ్యక్తిత్వ వికాసంపై

# ఎస్‌బీఐటీలో సదస్సు

**టీ మీడియా,మార్చి2, ఖమ్మం:**విద్యార్థులు ఈ పోటీ ప్రపంచంలో ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని యస్.బి.ఐ.టి కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. సోమవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస సదస్సులో విద్యార్థులనుద్దేశించి కృష్ణ ప్రసంగిస్తూ ప్రపంచ గతిని మార్చగల సత్తా విద్యార్థుల తరగతి గది నుంచే మొదలవుతుందని అభిప్రాయపడ్డారు. నేటి తరం యువత అతి చిన్న విషయాలకే ఆత్మహత్యలకు ప్రేరేపితులు అవుతున్నారని, వ్యక్తిగత అలవాట్లలలో మార్పులు, క్రమశిక్షణ ద్వారా వీటిని అధిగమించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు గంపా నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్లాస్‌రూమ్ టు బోర్డ్‌రూమ" అనే అంశం పై తమ కళాశాల విద్యార్థులకు జీవిత విలువలను, వ్యక్తిగత క్రమశిక్షణ పై అవగాహాన కల్పించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డా॥జి. ధాత్రి తెలిపారు. తరగతి గదులలో కేవలం జ్ఞానాన్ని మాత్రమే అందిస్తుందని, ప్రపంచం వాటికి పరీక్ష పెడుతుందని తెలిపారు. విద్యావ్యవస్థ కేవలం పరీక్షలు, గ్రేడులు, డిగ్రీలను అందిచడమే గాక పోటీ ప్రపంచంలో ఎదురయ్యే ప్రతి సవాళ్లను ఎదుర్కొని నిలబడగలిగే ధైర్యాన్నిస్తుందని కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య అభిప్రాయపడ్డారు.ముఖ్య అతిథి గంపా నాగేశ్వరరావు మాట్లాడుతూ బోర్డ్‌రూమ్ నిర్ణయాలను తీసుకునే, ప్రణాళికలను సిద్దంచేసే ఖర్మాగారం అని తెలిపారు. తరగతి గది లో నైనా తప్పులు దొర్లే అవకాశం ఉండోచ్చేమో గాని బోర్డ్‌రూమ్‌లలో తప్పుడు నిర్ణయాలు వ్యవస్థను, ఉద్యోగస్తులను, కుటుంబాలను చిన్నాబిన్నం చేస్తాయని అభిప్రాయ పడ్డారు. కళాశాల ప్రిన్సిపల్ డా॥జి.రాజ్ కుమార్ మాట్లాడుతూ తరగతి గదికి బోర్డ్‌రూమ్‌కు ఉన్న ఏకైక పోలిక టీమ్‌వర్క్ అని తెలిపారు. విద్యార్థులు ఎలాగైతే ప్రాజెక్ట్స్, వర్క్‌షాప్‌లలో కలిసి పనిచేస్తారో అదే విధంగా బోర్డ్‌రూమ్‌లలోను సమిష్టి పనితీరు అలవర్చుకోవడం మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి గంపా నాగేశ్వరరావును ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, వివిధ విభాగపు అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి క్వార్టర్లలో తప్పిన పెను ప్రమాదం

గ్యాస్ సిలిండర్ వైపు చేరుతున్నాయని గమనించిన యువకులు అజార్, జాఫర్ ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా ఇంట్లోకి దూసుకెళ్లారు. రంజాన్ ఉపవాసంలో ఉండి, రోజంతా ఆహారం తీసుకోకపోయినా మండుతున్న వేడి, కళ్లను మండించే పొగను తట్టుకుని సిలిండర్‌ను బయటకు తీసుకువచ్చారు. ఆ సమయంలో ఒక్క చిన్న నిర్లక్ష్యం జరిగినా పెద్ద విషాదం జరిగేదని స్థానికులు చెబుతున్నారు.ఇంటి పైకప్పు రేకులను పగలగొట్టి పైపులైన్ ద్వారా నీటిని చల్లుతూ మంటలను అదుపులోకి తెచ్చారు. వారి ధైర్యసాహసాల వల్ల మంటలు మరింత విస్తరించకుండా ఆగిపోయాయి. ఈ ఘటనలో ఇంటి సామగ్రి, మంచాలు, ఫ్రిజ్ తదితర గృహోపకరణాలు కాలిపోయినా ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించింది. రంజాన్ మాసంలో ఉపవాసంలో ఉన్నప్పటికీ "మనిషి ప్రాణమే ముందుగా" అన్న భావనతో ప్రాణాలను పణంగా పెట్టి ముందుకొచ్చిన ఈ యువకులను స్థానికులు అభినందిస్తున్నారు. మతం, కాలం, పరిస్థితి ఏమిటన్నది పక్కనపెట్టి మానవత్వం గెలిచిందని ప్రశంసిస్తున్నారు. ఈ ఘటన రుద్రంపూర్ ప్రాంతంలో యువతలో ఉన్న సేవాభావానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది.

# అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**





**టీ మీడియా,మార్చి2, ఖమ్మం:**ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.కొణిజర్ల మండలం దిద్దుపూడి గ్రామానికి చెందిన అమర్లపూడి భాస్కర రావు సర్వే నెంబర్ 82, 83 లో తమ భూమి ఉందని, సర్వే నెంబర్ 81లో ఉన్న తమ భూమిని సబ్ స్టేషన్ కోసం కేటాయించగా హైకోర్టు కేసు పెండింగ్ ఉండటంతో ఆ స్థలం నుంచి మార్చడం జరిగిందని, ప్రస్తుతం మున్సిపాలిటీ వారు అదే స్థలంలో ఎటు వంటి సర్వేలు చేపట్టకూడదని హైకోర్టు తీర్పు ఉన్నప్పటికీ డంపింగ్ యార్డ్ కు కేటాయించారని, దీనిని సరిచేసి తమ పేరు మీద పట్టా పాస్ పుస్తకాల జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.నేలకొండపల్లి మండలం ముఠాపురం గ్రామం పెద్దతండకు చెందిన గిరిజనులు గత ప్రభుత్వం సర్వే నెంబర్ 663 నందు తమకు ఆరు ఎకరాల స్థలం కేటాయించిందని, అందులో నుంచి మా గ్రామస్తులకు బంజారా భవన్, సేవాలాల్ మందిరం కొరకు స్థలం కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, నేలకొండపల్లి తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.చింతకాని మండలం పందిళ్ళపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీ ప్రియ అనంతసాగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 181 లో వ్యవసాయ భూమి ఉందని, సర్వే నెంబర్ 182 లో ఉన్న మరో ఎకరం భూమి కూడా తాము వారసత్వంగా సాగు చేసుకుంటున్నా మని, తమ పట్టా పాస్ పుస్తకంలో ఆ భూమి వివరాలు కూడా నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, చింతకాని తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## తొలి రోజు ప్రజావాణిలో
# కలెక్టర్ ఝలక్

**-11 దాటడంతో నిల్ అటెండెన్స్**

**టీ మీడియా,మార్చి2, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో నూతన కలెక్టర్ అంకిత్ తొలి రోజు ప్రజావాణి నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు అధికారులు అందరూ హాజరు కావాలని అంతకుక్రితం రోజే ప్రకటన జారీ చేశారు. అయినా 11 గంటల వరకు సైతం కొద్దిమంది జిల్లా అధికారులు మాత్రమే ప్రజావాణికి హాజరయ్యారు. ఎప్పటిలాగే పలువురు అధికారులు హాజరు కాలేదు. అప్పటికే 11 దాటడంతో అధికారుల నుండి అటెండెన్స్ తీసుకోమని కలెక్టర్ ఆదేశించారు. దీంతో వచ్చిన వారు, వివిధ శాఖల అధికారులు, కిందిస్థాయి సిబ్బంది సంతకాలు పెట్టారు. ఇది గమనించిన కలెక్టర్ జిల్లా అధికారులు మాత్రమే సంతకాలు పెట్టిన షీట్ ఇవ్వాలని చెప్పడంతో అధికారులు తడబడి అప్పటికప్పుడు వేరే షీట్‌పై సంతకాలు చేసి మధ్యాహ్నం 12 గంటల్లోపు అటెండెన్స్ షీట్‌ను కలెక్టర్‌కు చేరవేశారు.అనంతరం కలెక్టర్ వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలకు తగు పరిష్కారాలు సూచించారు. అనంతరం కలెక్టర్ స్పందిస్తూ.. ప్రతీ అధికారి తప్పనిసరిగా ప్రజావాణికి హాజరు కావాలన్నారు. తప్పని పరిస్థితి అయితే ముందుగా అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన. హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్, ఆర్డీఓ మధు. డీపీఓ దిలీప్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రకృతి ఒడిలో ఆధ్యాత్మికత

**-గుంజేడు ముసలమ్మ జాతర!**

**-ఏర్పాట్లు పూర్తి: దేవాదాయ శాఖ**




**టీ మీడియా,మార్చి2, మహబూబాబాద్:** దట్టమైన అటవీ ప్రాంతం.. ప్రకృతి ఒడిలో పరవశించే ఆధ్యాత్మిక కేంద్రం గుంజేడు. ఇక్కడ కొలువైన శ్రీ ముసలమ్మ అమ్మవారు భక్తుల పాలిట కల్పవల్లిగా విరాజిల్లుతున్నారు. రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ వనదేవత జాతర నేడు అత్యంత వైభవంగా ప్రారంభంకానుంది.నాడు ఆదివాసీల ఇలవేల్పుగా వెలసి.. నేడు అందరి మొక్కులు తీర్చే దేవతగా కొలువు దీరిన మహిమగల తల్లి శ్రీముసలమ్మ దేవత. నిత్యం భక్తులు కోరిన కోర్కెలు తీర్చి మొక్కులు పొందుతోంది. శ్రీముసలమ్మ జాతరకు దేవాదాయ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మార్చి 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ జాతర కు భారీగా భక్తులు తరలిరానున్నారు.

**ఇక్కడి స్థల పురాణం ఎం చెప్పుతుంది**

ఈ ప్రాంతం ఏజెన్సీ కావడంతో చుట్టూ దట్టమైన అడవి, పక్కనే సెలయేరు... పారుతుంటే చూడటానికి ఆహ్లాదాన్ని అందిస్తూ ఆ దేవత తన్మయత్నంలో మునిగిపోతూ ఆధ్యాత్మికత ను ప్రతిబింబించే విదముగా కొత్తగూడ మండలం గుంజేడులో శ్రీములనమ్మ దేవత వెలసింది. జీవనోపాది కోసం చత్తీస్ గడ్ రాష్ట్రంలోని బస్తర్ జిల్లా నుంచి తల్లిదండ్రులతో కలిసి వచ్చిన శ్రీముసలమ్మ, తన చెల్లెలు ముత్యాలమ్మ గోదావరి దాటి తమకు అనువైన ప్రాంతం కోసం వెతుకుంటూ వస్తున్న క్రమంలో గుంజేడు ప్రాంతానికి రాగానే దోపిడి దొంగలు వారి నుంచి ధనం,బంగారు దోచుకునేందుకు వెంటపడ్డారు. వారితో శ్రీముసలమ్మ, ముత్యాలమ్మ విరోచ్చితంగా పోరాడుతున్న సమయంలో ముత్యాలమ్మ వీరమరణం పొందగా, శ్రీమునలమ్మ వారి (దోపిడీ దొంగల) నుంచి తప్పించుకునే క్రమంలో గుంజేడు ప్రాంతంలోని గుట్టలోకి వెళు తుంది. చాలాకాలం తరువాత తోలెం వంశీయుల కలలో కనిపించి నేను గుట్టలో కొలువై ఉన్నాను. నన్ను కొలిస్తే మీ కోరికలు తీరుస్తాను.. మీకు సుఖ, సంతోషాలు అందిస్తానుని చెబుతుంది. మరుసటి రోజు వారు వెళ్లి వెతకగా కుంకుమ భరిణి రూపంలో అమ్మవారు కనిపించారు. కుంకుమ భరణను తీసుకువచ్చి గుంజేడు వాగు సమీపంలో ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ఆనాటి నుండి నేటి వరకు శ్రీముసలమ్మ దేవత మహిమలు ఇతర ప్రాంతాలకు వ్యాపించడంతో అన్ని వర్గాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీముసలమ్మ దేవతను కొలుస్తున్నారు. ఈ దేవాలయానికి తోలెం వంశీయులే పూజారులుగా ఉంటున్నారు. ఆలయం పక్కనే శ్రీముసలమ్మ చెల్లెలు ముత్యాలమ్మ తల్లి గుడిని ఏర్పాటు చేశారు. దేవాలయం సమీపంలో ప్రవహించే వాగు నీటిని తీసుకెళ్లి కొందరు ఇళ్లలో చల్లుకుంటారు. రైతులు తీసుకువెళ్లి పొలాలల్లో చల్లుకుంటే పంట మంచి దిగుబడి వస్తుందని చెబుతుంటారు.శ్రీముసలమ్మ జాతర సందర్భంగా గుంజేడు గ్రామంలో మట్టి ఇళ్లను అలికి రంగులు వేసుకుని ముగ్గులు వేసుకుని ముస్తాబు చేసుకుంటారు. మొదటి రోజు సాయంత్రం గుంజేడు గ్రామస్థులు ముత్యాలమ్మ దేవతకు బోనాలు సమర్పిస్తారు. గురువారం పడిగలు పట్టుకుని గుట్టకు వెళ్లి శ్రీముసలమ్మ దేవతను తీసుకువచ్చి గుడిలో ప్రతిష్ఠిస్తారు. శుక్రవారం భక్తులు శ్రీముసలమ్మను దర్శించుకుంటారు.ముసలమ్మ అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని ప్రగాఢ నమ్మకం, మరి ముఖ్యంగా సంతానం లేని వారికి సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం పోసి, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. మేడారం తరహాలోనే ఇక్కడ కూడా బెల్లాన్ని (బంగారం) నైవేద్యంగా సమర్పిస్తారు. అలాగే తాము పండించిన పంటను కూడా నైవేద్యంగాఇవ్వడం విశేషం. ఆ సాయంత్రమే శ్రీముసలమ్మ దేవత వనప్రవేశంతో జాతర ముగుస్తుంది.

**అందంగా ముస్తాబైన దేవాలయం**

దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో గుడి ప్రాకారానికి రంగులు వేయించారు. విగ్రహాలకు రంగువేసి ముస్తాబు చేశారు. భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీములసమ్మ దేవతను దర్శించుకోవాలని ఉత్సవ కమిటీ చైర్మన్ భూక్య సరేందర్, ఈవో అనిల్, పూజారులు తోలెం చిన్న నర్సయ్య, వెంకటేశ్వర్లు, తోలెం వెంకన్న. కిరణ్ కుమార్, తోలెం నవీన్, తోలెం రాంబాబు, స్థానిక సర్పంచ్ తోలెం అనంతరావు కోరుతున్నారు.



### ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పాయం ఆకస్మిక తనిఖీలు

**టీ మీడియా,మార్చి2, మణుగూరు**

మండలంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలో పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలను సమీక్షించిన ఎమ్మెల్యే మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్క రోగిని స్వయంగా పలకరించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గర్భిణులను, ఇటీవల ప్రసవించిన తల్లులను కలిసి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తాజాగా జన్మించిన శిశువును ఆశీర్వదించారు. అనంతరం ఓపి విభాగం, ల్యాబ్‌ను పరిశీలించి అందుబాటులో ఉన్న సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని బీపీ పరికరంతో స్వయంగా బీపీ పరీక్ష చేయించుకుని సిబ్బందితో మాట్లాడారు. పేషంట్ల సౌకర్యార్థం అదనంగా లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వంద పడకల ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సునీల్, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, కోర్స ఆనంద్, సమితి సింగారం ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, లంక మల్లారం సర్పంచ్ పూణెం రమేష్, గుట్ట మల్లారం సర్పంచ్ కారం పూజిత, గుట్ట మల్లారం ఉప సర్పంచ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్ అంకిత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే



**టీ మీడియా,మార్చి2, పాల్వంచ**

కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టరుకు వివరించిన శాసనసభ్యులు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు, దీర్ఘకాలిక సమస్యలపై దృష్టిసారించాలని కోరిన కూనంనేని, నియోజకవర్గ భౌగోళిక పరిస్థితులు, పారిశ్రామిక ప్రాముఖ్యతను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్‌కు పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ ఉన్నారు.